క్లుప్తంగా

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి

పాణ్యం : ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పాణ్యంలోని డొంగు, పలు ప్రదేశాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొత్త పెనాల్టీలను అమలులోకి తెచ్చిందన్నారు. వీటి ఆధారంగా భారీగా జరిమానాలు వేయడం జరుగుతుందన్నారు. అనంతరం పలు బైక్‌ల రికార్డులు తనిఖీ చేసి జరిమానా విధించారు.

బాధిత కుటుంబానికి కాటసాని పరామర్శ

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న ఏపీ మోడల్‌స్కూల్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న దుమావత్ స్వామినాయక్(59) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న నంద్యాల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి బాధిత కుటుంబానికి ఫోన్ చేసి పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పాణ్యం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, సుగాలిమెట్ట గ్రామ సర్పంచ్ దేవీబాయి, మాజీ సర్పంచ్‌లు సుబ్బరాయుడు, పుల్లయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రానాయక్ తదితరులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అలాగే ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ దినేష్‌బాబు, సిబ్బంది మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య జంగ్రీబాయి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు



విద్యార్థులు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి

గడివేముల: మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక రాజరాజేశ్వరీ హైస్కూల్‌లో కొత్త మోటార్ వెహికల్ యాక్ట్ నియమాలు, జరిమానాలు, ట్రాఫిక్ నిబంధనలు, అతి వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, ఓవర్ లోడ్, డ్రైవింగ్ లైసెన్స్, ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వల్ల దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు ఎవరు లోనుకాకుండా చదువు కుంటే భవిష్యత్ బాగుంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మండల మహాసభలను జయప్రదం చేయండి

ఓర్వకల్లు : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27వ తేదీన నిర్వహించే సీఐటీయూ మండల మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు శ్రీధర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముందుగా కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు. అనంతరం సీఐటీయూ మండల అధ్యక్షులు షాజహాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలం పూర్తైనప్పటికీ అసంఘటిత కార్మికుల సమస్యలు గుర్తుకు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మహాసభలకు అసంఘటిత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ మండల నాయకులు సుధాకర్, ధనుంజయ, నాగభూషణం, రాజు, మద్దయ్య, గిడ్డయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీ.క్యాంపు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులోని సి.క్యాంపు రైతుబజారును గురువారం ఒక్కరోజు బంద్ చేస్తున్నట్లుగా ఎస్టేటు ఆఫీసర్ కళ్యాణి, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. రైతుబజారులో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని, క్లీనింగ్ నిమి త్తం ఒకరోజు సెలవు ప్రకటించినట్లు బుధవారం వారు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి యథావిధిగా రైతుబజారు పనిచేస్తుందని పేర్కొన్నారు.

25న వాహనాల వేలం

కర్నూలు(హాస్పిటల్): ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 65 వాహనాలను ఈ నెల 25వ తేదీన కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు సీఐ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న వాహనాలను వేలం వేయాల్సి ఉందని, అనివార్య కారణాల వల్ల 25న ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నామన్నారు. ముందుగా తాలూకా పోలీస్ స్టేషన్‌లో ధరావత్తు రూ.5 వేలు చెల్లించి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు.

మిర్చి సాగుపై అనాసక్తి

- గతేడాది సాగుచేసిన మిర్చికి ధర లేక భారీగా నష్టపోయిన రైతులు
- ఈ ఏడాది ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు
- తగ్గిన మిర్చి సాగు విస్తీర్ణం



గడివేముల, గనిలో సాగు చేసిన పత్తి , మొక్కజొన్న పంటలు

గడివేముల: వాణిజ్య పంటల్లో ప్రధానమైన మిర్చి పంట సాగుపై రైతులు ఆసక్తి చూపించడం లేదు. మిర్చి సాగు చేయాలంటే రైతులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. గత ఏడాది మిర్చి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నష్టాలు చవిచూశారు. దీనికి తోడు ఎరువులు, పురుగుల మందుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పంట సాగు చేసేందుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు మొగ్గుచూపుతున్నారు.

సగానికి పైగా తగ్గిన విస్తీర్ణం

గడివేములతో పాటు బిలకలగూడూరు,గని, మంచాలకట్ట, కొర్రపోలూరు గ్రామాల్లో అధికంగా మిరప పంట సాగు చేసేవారు. ప్రస్తుతం ఐదు వందల నుంచి వెయ్యి ఎకరాల దాకా సాగయ్యే అవకాశం ఉంది. మండలంలో గత ఏడాది దాదాపు 2 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. గత సంవత్సరం మిర్చి దిగుబడులు బాగానే వచ్చినా మద్దతు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్వింటా మిర్చి ధర రూ.22 వేల నుంచి రూ.24 వేల వరకూ ఉండగా కూటమి ప్రభుత్వం రాగానే మిర్చి క్వింటా ధర రూ.9 వేల నుంచి రూ.12 వేలు కూడా పలకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

గతేడాది దిగుబడి ఏసీ గోడౌన్లలోనే

కొంత మంది రైతులు క్వింటా ధర రూ.9 వేల నుంచి రూ.12 వేల వరకూ అమ్ముకోగా మరికొంత మంది రైతులు ధర పూర్తిగా పతనం కావడంతో గుంటూరు, నంద్యాల పట్టణాల్లోని ఏసీ గోడౌన్లలో వందలాది క్వింటాళ్ల మిర్చి నిల్వ చేసుకున్నారు. ఎకరా మిర్చి సాగు చేయడానికి విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, సేద్యాలు, కూలీలు కలిపి దాదాపు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకూ పెట్టుబడి అవుతుందని రైతులు వివరించారు.

పొలాల్లోనే వదిలేసిన మిర్చి పంట

గత ఖరీఫ్‌లో సాగు చేసుకున్న మిర్చి పంట దిగుబడి వచ్చినా కనీస మద్దతు ధర లేకపోవడంతో చివరికోత కోసేందుకు కూలీల ఖర్చు పెరిగిపోవడంతో చాలా మంది రైతులు కోత చేయకుండానే పొలంలో వదిలేసిన ఘటనలు గ్రామాల్లో చోటు చేసుకున్నాయి.

పత్తి, మొక్క జొన్న సాగుపై రైతుల మొగ్గు

ఈ ఏడాది మండలంలో మిర్చి పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు పత్తి, మొక్క జొన్న, సోయాబీన్ సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ బోర్ల కింద ఎకరాల్లో ఆయా పంటలను సాగు చేస్తున్నారు. దీనికి తోడు వర్షాలు వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో పాటు ఆలస్యంగా, అరకొరగా కురవడంతో విత్తనాలు నాటేందుకు అనాసక్తి చూపుతున్నారు.

క్వింటా కూడా అమ్మలేదు



గతంలో నేను ఐదు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశా. మిర్చి పంట దిగుబడి బాగా వచ్చి నా గిట్టుబాటు ధర లేకపోవడంతో క్వింటా కూడా అమ్మలేదు. ధర లేకపోవడంతో మిర్చి పంటంతా గుంటూరులో ఏసీ గోడౌన్‌లో భద్రపరిచా. మిర్చికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రస్తుతం మూ డు ఎకరాల్లో పత్తి, నాలుగు ఎకరాల్లో మొక్క జొన్న పంట సాగు చేశా.

– తలారి బాలచెన్ని, మిర్చి రైతు, గడివేముల

మిర్చికి రూ. లక్షల్లో పెట్టుబడి



ఐదు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. తీరా మిర్చి దిగుబడి వచ్చిన సమయానికి క్వింటా రూ.9 వేల నుండి 12 వేలు మాత్రమే ధర ఉంది. ధరలు పెరగకపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్వింటా మిర్చి ధర రూ.20 వేల నుంచి 24 వేల వరకు పలికింది. ఇప్పుడు మిర్చికి గిట్టుబాటు ధర లేకపోవడంతో అరకొరగానే మిర్చి పంట సాగు చేశారు.

– దాసరి రాముడు, గడివేముల

గతంలో 20 ఎకరాలు సాగు చేసేవాడిని



గతంలో ప్రతి ఏడాది 20 ఎకరాల దాకా వివిధ రకాల మిరప పంటను సాగు చేసేవాడిని. గతేడాది మిరప పంటకు రోగాలు అధికంగా రావడంతో పాటు ధర తగ్గడంతో పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పండింది. మందుల ఖర్చులకు రాని పరిస్థితి రావడంతో ప్రస్తుతం నాలుగు ఎకరాల్లో మాత్రమే మిరప పంట సాగు చేస్తున్నా. మిగతా పొలంలో మొక్కజొన్న, పత్తి,పొగాకు పంటలను సాగు చేస్తా.

– పైపాలెం ఉశేని, గడివేముల

నెలాఖరులోగా పంట బీమా చేసుకోండి

సి.బెళగల్: రైతులు సాగు చేసిన పంటలకు ఈ నెలాఖరులోగా బీమా నమోదు చేయించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని ఇనగండ్ల గ్రామంలో వ్యవసాయ సిబ్బందితో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ రైతులు సాగు చేస్తున్న పత్తి, మిరప, ఉల్లి పంటలను పరిశీలించి, సస్యరక్షణ పద్ధతులను రైతులకు తెలియజేశారు. అనంతరం స్థానిక రైతు సేవా కేంద్రంతో రైతులతో సమావేశమయ్యారు. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా కంది, మిరప, ఉల్లి, వరి పంటలను సాగు చేసుకున్న రైతులు ప్రీమియం చెల్లించి జూలై చివరి నాటికి పంటల బీమాను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ సునీత, ఎంపీఈఓలు వెంకటేష్, ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఏపీఓ రామన్న

సి.బెళగల్: మండలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏపీఓ రామన్న హెచ్చరించారు. బుధవారం జేఈ రంగస్వామితో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ఉపాధి హామీ టీఏలు, ఎఫ్‌ఏలతో పనులపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పనులు, వాటి రికార్డుల నిర్వహణలో జాగ్రత్తలు వహించాలని, తప్పులకు తావులేకుండా పనులను చేపట్టాలన్నారు. టీఏలు రామ్‌శంకర్, మురళి, రాజశేఖర్, ఉమామహేశ్వరి, గోవర్ధన్, లక్ష్మి పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



సస్య రక్షణ పద్ధతులు వివరిస్తున్న శాస్త్రవేత్త రామక్రిష్ణారావు

కర్నూలు(రూరల్): పత్తి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్య రక్షణ పద్ధతులు పాటించాలని ఎరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ. రామక్రిష్ణా రావు అన్నారు. బుధవారం కర్నూలు మండల మునగాలపాడు, నిడ్జూరు గ్రామల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆ గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న పత్తి పంటలను సందర్శించారు. పత్తి పంటల్లో గులాబీ పురుగు ఉధృతిని గమనించి దాని నివారణకు లింగకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెండవ దఫా 100 ఎమ్ఎల్ ప్రొఫెనోఫాస్ లీటరు నిటికి కలపి ఒక ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. మరియు ముడవ దఫా కురాక్రాన్ 60 ఎమ్ఎల్ ఒక ఎకారానికి పిచికారీ చేయాలని సూచించారు. పేను బంక, జీడి సమస్య ఉన్న పంటపై ఎనిఫేట్ 400 ఎంఎల్ ఒక ఎకారానికి పిచికారీ చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల అధికారి రూఫస్ రోనాల్డ్, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కోడుమూరు రూరల్ : ఖరీఫ్ కింద సాగు చేసిన పత్తి పంటను రైతులు ప్రతిరోజు పరిశీలిస్తూ ఉండాలని, ఏవైనా చీడపీడలు సోకితే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి దస్తగిరి రెడ్డి సూచించారు. బుధవారం గూడూరు మండలంలోని చనుగొండ్ల గ్రామంలో ఏఓ దస్తగిరిరెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ మదన్‌మోహన్ పత్తి పంట, పండ్ల తోటల సాగుపై 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పలు సూచనలిచ్చారు. ఏఓ మాట్లాడుతూ పత్తి పంటకు ప్రస్తుతం రసం పీల్చే పురుగు, దోమ సోకుతోందని, వీటి నివారణకు వేపనూనె పిచికారీ చేసుకోవడంతో పాటు, పచ్చ, తెల్ల దోమ నివారణకు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే పత్తి పంటకు ప్రధాన శత్రువైన గులాబీ రంగు పురుగు నివారణ కోసం లింగాకర్షక బుట్టలను ఎకరానికి నాలుగు చొప్పున ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఖరీఫ్ కింద పంటలు సాగు చేసిన రైతులంతా ఈనెలాఖరులోగా ఫసల్ బీమా చేయించుకోవాలన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా
- చిన్నటేకూరు గురుకుల కళాశాల, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



చిన్నటేకూరు గురుకుల కళాశాలలో టాయిలెట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కల్లూరు: వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కల్లూరు మండలం చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలను జిల్లా కలెక్టర్ తనఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలు, విద్యా బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు నిద్రపోవడానికి అదనంగా రెండు గదులు, కొన్ని గదుల్లో పైకప్పు పాడైనందువల్ల వాటి మరమ్మతులక అంచనాలు సిద్ధం చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవిని ఆదేశించారు. టాయిలెట్‌లను పరిశీలిస్తూ మరింత మెరుగ్గా టాయిలెట్లను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్వోప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని డీసీఓ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా త్వరలో మరమ్మతులకు, గదుల నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

తరగతి గదిలో పాఠాలు విన్న కలెక్టర్

జిల్లా కలెక్టర్ గురుకుల కళాశాలలో విద్యార్థులతో కలసి గణిత లెక్చరర్ బోధిస్తున్న పాఠం విన్నారు. విద్యార్థులకు నాణ్యమై విద్యను అందించాలని, సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయాలని అధ్యాపకులను సూచించారు. అలాగే మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యమైన భోజనం అందించాలని, వసతి గృహంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఐఐటీ నీట్ అకాడమీ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరప్ప, ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎఫ్ ఎక్స్ చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, చిన్నారులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. చిన్నటేకూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని, పౌష్టికాహార కిట్లను పంపిణీచేసి, వాటిని సకాలంలో వినియోగించుకునేలా చూడాలన్నారు. అనంతరం వంట గదిలో పిల్లలకు వండిన ఆహారాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ నిర్మల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలు బట్టబయలు

- ఆడబిడ్డ నిధిపై చేతులెత్తేసిన ప్రభుత్వం
- ఎన్నికల్లో మహిళల సత్తా చూపిస్తాం
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి



మాట్లాడుతున్న కల్లా నాగవేణి రెడ్డి

కర్నూలు (టౌన్): సూపర్ సిక్స్ హామీల అమల్లో చంద్రబాబు మోసాలు బట్టబయలయ్యాయని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి వెల్లడించారు. ఆమె బుధవారం ఎస్వీ కాంప్లెక్స్‌లో మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కోలేక, బీజేపీ, జనసేనతో జతకట్టి, ప్రజలకు అలవిగాని హామీలు ఇచ్చి మభ్యపెట్టి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారన్నారు. ఆడబిడ్డ నిధి కింద మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని ప్రకటించడంతో ఎన్నికల సమయంలో మహిళలు ఎంతో సంతోషపడ్డారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటిన తరువాత టీడీపీ మంత్రి అచ్చెంనాయుడు ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాలని చెప్పడం మహిళలకు ద్రోహం చేయడం కాదా?.. అని ప్రశ్నించారు. అలాగే 50 సంవత్సరాలు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రూ.4 వేలు పెన్షన్ ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పి నిలువునా ముంచారని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ హామీల పేరుతో ఇంటింటికీ బాండ్లు పంచి ఇప్పుడు మాట తప్పడం చంద్రబాబు మోసాలకు పరాకాష్ట అన్నారు. తొలి ఏడాదికే రూ.32,400 కోట్లు అక్కచెల్లెమ్మలకు ఇవ్వకుండా మోసం చేశారని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు ఇప్పుడు అన్ని వర్గాలను మోసం చేయడం దారుణమన్నారు. మోసపూరిత ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



అమడగుంట్లలో వీధులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని కోడుమూరు ఎంపీడీఓ రాముడు అన్నారు. బుధవారం మండలంలోని గోరంట్ల, అమడగుంట్ల, అనుగొండ గ్రామాల్లో ఎంపీడీఓ పర్యటించి ఇంటింటి నుంచి చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త పారవేయకుండా తమ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ రిక్షాల్లో మాత్రమే వేయాలని సూచించారు. అంతకుముందు ఎంపీడీఓ గోరంట్లలోని అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి పిల్లలకు సక్రమంగా పోషకాహారం అందిస్తున్నారా, శుభ్రతపై సూచనలిస్తున్నారా అని వాకబు చేశారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్ : డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని గూడూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రత్యూష సూచించారు. బుధవారం గూడూరులోని హరిజనవాడలో ఓ బాలుడికి డెంగీ పాజిటివ్ నమోదు కావడంతో వైద్య సిబ్బంది ఆ కాలనీలో పర్యటించి పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ప్రజలంతా ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా దోమల వల్ల అధికంగా జ్వరాలు, వ్యాధులు వచ్చే అవకాశముందన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేయడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటి వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ క్రిష్ణారెడ్డి, ఎంపీహెచ్‌ఓలు రాజారావు, మారుతి, ఏఎన్‌ఎంలు రత్నమ్మ, నెలలవేణి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం బృందం నగరంలోని గవర్నమెంట్ గర్ల్స్, ఉర్దూ బాయ్స్, మైనార్టీ జూనియర్ కాలేజీల్లో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించింది. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూలులో మధ్యలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉర్దూ బాయ్స్ హైస్కూలులో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. మైనార్టీ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు ఆటస్థలం చూపాలని కోరారు. నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నాయకులు పార్వతయ్య, శాలిబాషా పాల్గొన్నారు.

టీబీపై అవగాహన



చిల్లబండలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కోడుమూరు రూరల్ : టీబీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అనుమానిత లక్షణాలుంటే వెంటనే పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స పొందాలని జిల్లా టీబీ ఆఫీసర్ భాస్కర్ సూచించారు. బుధవారం మండలంలోని చిల్లబండ గ్రామంలో టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిల్లబండ గ్రామం టీబీ రహిత గ్రామంగా ఎంపికై నందున గ్రామ పంచాయతీకి టీబీ ముక్త్ పంచాయతీ అవార్డు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం టీబీ వ్యాధి లక్షణాలు, ఏవిధంగా సంక్రమిస్తుంది, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ భాస్కర్, సీహెచ్‌ఓ శాంతమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ యాదవ్, సూపర్‌వైజర్ శారద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాన్ల మాయంపై చర్చ

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ హాస్టళ్లలో ఫ్యాన్లు మాయం కావడంపై చర్చ జరుగుతోంది. రూసా నిధులతో వర్సిటీ హాస్టళ్ల, వివిధ డిపార్ట్‌మెంట్‌లలో కొత్త ఫ్యాన్లను ఏర్పాటు చేస్తున్నారు. అయితే పనిచేస్తున్న ఫ్యాన్లను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడమేంటని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు చర్చించుకుంటున్నారు. పనిచేయని చోట కొత్తవి ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తొలగించిన ఫ్యాన్లు పదుల సంఖ్యలో కనిపించడం లేదని విద్యార్థులు అంటున్నారు. గత రెండేళ్లలో ఇలానే వందల సంఖ్యలో ఫ్యాన్లు మాయమైనట్లు చెబుతున్నారు. ఎవరైనా దొంగలించారా, స్క్రాప్ కింద అమ్ముకున్నారో స్పష్టత లేకపోవడం గమనార్హం. ఈ విషయమైన వర్సిటీ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ ఎన్.నరసింహులును వివరణ అడగ్గా ఫ్యాన్లు మాయమైనట్లు తన దృష్టికి రాలేదన్నారు. ఇలాంటివన్నీ ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులు చూసుకుంటారని వారిని సంప్రదిస్తే స్పష్టత వస్తుందన్నారు. ఫ్యాన్లు పనిచేయడం లేదు, కావాలని లెటర్ పెడితే రిజిస్ట్రార్‌కు ఫార్వర్డ్ చేస్తుంటానన్నారు.

తగిన మోతాదులో ఎరువులు వాడాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వేదమణి

ఓర్వకల్లు: పంటలకు వినియోగించే ఎరువులు తగిన మోతాదులో వినియోగించడం వల్ల ఆశించిన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు రైతులకు తెలిపారు. బుధవారం మండలంలోని గుడుంబాయి తండా, కన్నమడకల, ఓర్వకల్లు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మధుమతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్రం నుంచి ఏడీఏ వేదమణి, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త శివరామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏడీఏ మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగుచేసిన వరి, కంది, పత్తి, మొక్కజొన్న పంటలకు మోతాదును మంచి ఎరువులను వాడితే వచ్చే అనార్థాలను వివరించారు. ఏ సమయంలో ఏయే రకాల ఎరువుల వాడాలి? వాటి ప్రయోజనాలను గూర్చి వెల్లడించారు. పంటలను ఆశించే పురుగుల నివారణకు శాస్త్రీయ పద్ధలను పాటించాలని తెలిపారు. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న పంటలలో బెట్ట పరిస్థితులు కనింపిచినప్పుడు 10 గ్రాముల యూరియాను లీటరు నీటిలో కలిపి వారంలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, వీఏఏలు పాల్గొన్నారు.

దెబ్బతిన్న కొరటమద్ది బ్రిడ్జి

బ్రిడ్జిపై రోడ్డు దెబ్బతిని కడ్డీలు బయటపడిన దృశ్యం



గడివేముల: మండల పరిధిలోని నంద్యాల–నందికొట్కూరు ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. కొరటమద్ది గ్రామ సమీపంలోని కుందూపై నిర్మించిన బ్రిడ్జి దెబ్బతిని కడ్డీలు బయటపడ్డాయి. దీంతో బ్రిడ్జికి రంధ్రం పడే అవకాశం ఉంది. నిత్యం ప్రభుత్వాధికారులు ప్రయాణిస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రహదారిలో ప్రతి నిత్యం వందలాది జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ, సోలార్ సంబంధించిన భారీ వాహనాలతో పాటు పలు వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. బ్రిడ్జిపైన ఉన్న కడ్డీలు వాహనచోదకులకు కనపడకపోవడంతో ప్రమాదాలు జరుగుతాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన బ్రిడ్జిపై గుంతకు మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.